## మంత్రి పొన్నంను విమర్శించే స్థాయి బొమ్మ శ్రీరాంకు లేదు

**కోహెడ, మార్చి 22, ప్రభాతవార్త :**
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను విమర్శించే కనీస నైతిక హక్కు బిజెపి నాయకులు బొమ్మ శ్రీరాంకు లేదని  వింజపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు శెట్టి సుధాకర్ మండిపడ్డారు. శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పొన్నం ప్రభాకర్‌గౌడ్ చేసిన కృషి మరవలేనిదన్నారు. బండి సంజయ్‌లా పరువు తీసే పనులకు పొన్నం పాల్పడడం లేదన్నారు. 5 యేండ్లు ఎంపిగా పని చేసిన బండి సంజయ్ మండలానికి ఏమి ఓరగబెట్టారో తెలుపాలని డిమాండ్ చేశారు. కనీస రాజకీయ పరిజ్ఞానం లేకుండా బండి సంజయ్ మెప్పు కోసం ఇతరులపై అరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నీకు రాజకీయ బిక్షపెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయ లబ్దికోసం పార్టీ మారి హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై అర్థం పర్థం లేకుండా అరోపణలు, విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు.




## బిజెపి గజ్వేల్ పట్టణ నూతన కమిటీ నియామకం

**గజ్వేల్ టౌన్, మార్చి 22 (ప్రభాతవార్త):**
భారతీయ జనతా పార్టీ గజ్వేల్ పట్టణ నూతన కమిటీని శుక్రవా రం నియమించినట్లు బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనో హర్‌యాదవ్ తెలిపారు.నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా మైస విజయ్, చెప్యాల వెంకట్‌రెడ్డి, వడ్డేపల్లి ప్రసాద్, నాయిని సందీప్, మాదుగురి నర్సింలు, ప్రధాన కార్యదర్శులుగా కొలుపుల నరేందర్, ఐల మహేందర్, మంద వెంకటేష్, కార్యదర్శులుగా సింగారం కిష్టాగౌడ్, కొన్నె రాజశేఖర్‌రెడ్డి, శ్రీరాం కృష్ణ, కాశమైన నవీన్, చెన్నోజి నీరజ, కోశాధికారిగా లింగం పల్లి హరికుమార్, అధికార ప్రతినిధులుగా ఎర్రగొల్ల రాజుయాదవ్, ఎల్ల బాబు, క్రాంతిగౌడ్, పంజాల శివకుమార్, యువ మోర్చా మెతుకు కరుణాకర్, మహిళా మోర్చా సిలివేరు కుంకుమరాణి, కిసాన్ మోర్చా సంగం కరుణాకర్, ఎస్సీ మోర్చా గడ్డమీది ప్రశాంత్, ఎస్టీ మోర్చా రమేష్, బీసీ మోర్చా దువ్వల రాజు యాదవ్, సోషల్ మీడియా, ఐటి సెల్ కన్వీనర్‌గా గుంజేటి సాయితేజ, కో- కన్వీనర్‌గా చింతల రోహిత్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీ తక్షణమే అమలులోకి వస్తుందని, భారతీయ జ నతా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణగా పనిచేస్తుందని తెలిపారు.

## ప్రతి ఓటరు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

### -అదనపు కలెక్టర్ రమేష్



వాక్ టు ద పోలింగ్ స్టేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రమేష్

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి22 ప్రభాతవార్త:**
వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నమోదైన ప్రతి ఓటరు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్వీప్ ద్వారా వాక్ టు ద పోలింగ్ స్టేషన్ ఓటరు అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం జిల్లా వ్యాప్తంగా పెంచడంలో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో వాక్ టుద పోలింగ్ స్టేషన్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వీప్ 2024 ఓటరు చైతన్యం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఆయుధం అని, ఇప్పటికే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ జిల్లాలో 100 శాతం పోలింగ్ సాధించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు తప్పనిసరిగా ఫారం-6 నింపి సంబంధిత బూత్ స్థాయి అధికారికి అందజేయాలన్నారు. ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ,జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి, పీడీ మెప్మా ఇందిరా,బూత్ స్థాయి అధికారులు, ఆర్పీలు,మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మెదక్ ఎంపి అభ్యర్థిగా వెంకట్రాంరెడ్డి

### -ఫాంహౌజ్‌లో మెదక్ పార్లమెంట్ నేతలతో సమావేశమైన కెసిఆర్

**మర్కూక్, మార్చి 22 (ప్రభాతవార్త):**
మండల పరిధిలోని ఎర్రవల్లిలో గల మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరిపారు. ఇందులో మెదక్ పార్లమెంట్ అభ్య ర్థిగా సిద్దిపేట జిల్లా మాజీ కలెక్టర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకట్రాంరెడ్డిని అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ సీని యర్ నాయకులు పాల్గొన్నారు.

**ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషంగా ఉంది**
**-మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డి**

బిఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని సిద్దిపేట జిల్లా మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో తాను ప్రభుత్వ అధికారిగా పని చేసినందున ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి హరీష్ రావు, కెసిఆర్‌లు తనను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పదిన్నర సంవత్సరాలుగా ప్రభుత్వ అధికారిగా ప్రజా జీవనంలో ప్రజలతో మమేకమై ఉన్నందునే నాకు ఈ అవకాశం దక్కిందని పేర్కొన్నారు. తనను ఎంపి అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు కెసిఆర్, హరీష్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డి

## ఖరారైన బిజెపి, బిఆర్ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థులు

### -బిఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి
### -బిజెపి అభ్యర్థిగా రఘునందన్‌రావు
### -ఇక మిగిలింది కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటనే

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
పార్లమెంటు సాధారణ ఎన్నికల్లో భాగంగా మెదక్ పార్లమెంట్ నుంచి రెండు జాతీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరన్నది ఇంకా తేలడం లేదు. బిజెపి పార్టీ రెండో జాబితాలో మాజీ ఎమ్మెల్యే మాదవనేని రఘునందన్‌రావు పేరును ఖరారు చేసిన విషయం తెలిసిందే. కాగా బిఆర్ఎస్ అభ్యర్థి ఎవరన్నదానిపై గత కొద్ది రోజులుగా నెలకొన్న ఉత్కంఠతకు అ పార్టీ అధినేత మాజీ సిఎం కెసిఆర్ శుక్రవారం తెర దించారు. మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని తన ఫాంమ్ హౌజ్‌లో నిర్వహించిన మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నాయకులతో సమావేశం నిర్వహించి మాజీ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి పేరును ఖారు చేశారు. మెదక్ పార్లమెంట్ బిఆర్ఎస్ టికెట్‌ను ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సైతం ఆశించి భంగపడ్డారు. అ పార్టీ అధినేత మాజీ సిఎం కెసిఆర్ ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి పేరును ఖారారు చేయడంతో బిఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి ఎవరన్నది తేలిపోయింది. కాగా కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటీ వరకు అభ్యర్థి ఎవరన్నది తేల్చడం లేదు. కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు టికెట్‌ను ఆశిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మాత్రం నీలం మధు పేరును రేపోమాపో ప్రకటించే అవకాశం ఉన్నట్లు  తెలుస్తుంది.

## సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

### నమున్సిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య


మున్సిపల్ కమీషనర్‌కు పన్ను చెల్లిస్తున్న రైస్‌మిల్లు యజమాని

**చేర్యాల,మార్చి 22, ప్రభాతవార్త**
చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఎవరైన ఇంటి పన్నులు చెల్లించాల్సి ఉంటే ఈనెల31 లోపు చెల్లిస్తే పన్నుపై ఉన్న మిత్తి 90శాతం రాయితీ వర్తిస్తుందని ఇంచార్జి మున్సిపల్ కమీషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇంటి,దుకాణ,వాణిజ్య,వ్యాపార సంస్థల యజమానులకు పన్నుల పై ఉన్న మిత్తి 90శాతం రాయితి గురించి కమీషనర్ తెలియజేశారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని తెలిపారు. అలాగే పట్టణంలోని మురికి కాలువలలో దోమల నివారణ కొరకు పిచికారి చేయించారు. కమీషనర్‌తో మేనేజర్ జె.ప్రభాకర్, సర్వర్ శ్రీనివాస్, గంగాధర్, వెంకటేశ్‌లు, బాలక్రిష్ణ ఉన్నారు.

## నేడు మర్కుక్‌కు రానున్న రఘునందన్‌రావు

**మర్కుక్, మార్చి 22 (ప్రభాతవార్త):**
మండలకేంద్రమైన మర్కుక్‌కు శుక్రవారం బిజెపి మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు రానున్నట్లు మండల బిజెపి అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రఘునందన్‌రావు జన్మదినం సందర్భంగా మండలకేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బిజెపి శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## వరి పంట పరిశీలన


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి

**కోహేడ, మార్చి 22, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని వరికోలు గ్రామంలో శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు, మెడవిరుపు తెగులు ఉధృతి గమనించడం జరిగిందన్నారు. నివారణ కోసం రైతులు గట్ల వెంబడి కలుపు మొక్కలను తొలగించాలని అలాగే మొడి పురుగుకి కార్టాప్ హై డ్రోక్లోరైడ్ 75 శాతం ఎస్‌జీ 200 గ్రాములు ఎకరానికి లేదా క్లోరంత్ర నీలిప్రోల్ 18.5 శాతం ఎస్‌సీ 60 మీలీ ఒక ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. అలాగే మెడవిరుపు తెగులు నివారణకు ఫికాక్సిస్ట్రోబిన్ 6.8 శాతం+ట్రైసైక్లోజోల్ 20.3 ఎస్‌సి 400 మీలీ లేదా టేబుకోనోజోల్ 50+ ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 25 డబ్ల్యుజీ 80-120 గ్రాములు ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు.

## వేసవిలో వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి : కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి22 ప్రభాతవార్త:**
వేసవిలో వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని పోచారంలో ఉన్న వన విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. 4.5 కిలో మీటర్లు సఫారీ వాహనంలో అటవీ ప్రాంతంలో తిరిగి జింకల ప్రత్యుత్పత్తి కేంద్రాన్ని, జింకలు, నెమళ్లు, మనుబోతులు ఇతర అటవీ జంతువులను చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, జంతువులకు ఆహారం, త్రాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. వన విజ్ఞాన కేంద్రం ఏర్పాట్లు, అటవీ విస్తీర్ణం, సందర్శకుల సమయ పాలన గురించి అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, హవేళిఘనపూర్ తహశీల్దార్ నారాయణ, అటవీ సెక్షన్ అధికారి శ్రావణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ ప్రసాద్‌గౌడ్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా బార్డర్ చెక్‌పోస్ట్ పరిశీలన..**
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హవేళిఘనపూర్ మండలం పోచమ్మరాల్ వద్ద ఏర్పాటు చేసిన జిల్లా బార్డర్ చెక్‌పోస్ట్‌ను ఆర్డీవో రమాదేవి, తహశీల్దార్ నారాయణలతో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా రిజిష్టర్‌లను పరిశీలించి, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీల ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు, బంగారం వంటివి తరలిస్తే వెంటనే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. ఈ క్యాక్రమంలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ఉన్నారు.



పోచారం వన విజ్ఞాన కేంద్రం వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్ రాజ్


వాహనాల తనిఖీల్లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్

## దరఖాస్తుకు నేడే చివరి రోజు

**కొల్చారం, మార్చి22 ప్రభాతవార్త:**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23వ తేదీ తుది గడువు అని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. జయలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు

### -ఉపాధ్యాయ సంఘం నాయకుడు సత్యనారాయణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

**గజ్వేల్, మార్చి 22 (ప్రభాతవార్త):**
గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు అని ఉపాధ్యాయ సంఘం నాయకుడు సత్య నారాయణ పేర్కొన్నారు. గజ్వేల్ మండలం బూర్గుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇటీవల టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు సౌజన్యంతో సుమారు 300లకు పైగా పుస్తకాలు, ఒక బీరువాను పాఠశాల గ్రంథాలయానికి అందజేశారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డితో కలిసి టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకుడు వి.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మా పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసిన తలకొక్కుల రాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గ్రంథాలయ ఇన్‌ఛార్జి ఎస్.సుధాశ్రీ, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, టి. శ్రీనివాస్‌రెడ్డి, బషీరుద్దీన్, అర్జున్, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి లారీనీ ఢీ కొట్టిన కారు -ఒకరికి గాయలు


అదుపు తప్పి బోల్తా కొట్టిన కారు దృశ్యం

**బెజ్జంకి, మార్చి 22, ప్రభాతవార్త :**
కారు అదుపు తప్పి  అగి ఉన్న లారీని ఢీకొట్టిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.టిఎస్10ఎఫ్ఎబి521 నంబరుగల కారు సిద్దిపేట నుంచి కరీంనగర్‌కు వెళు_ండగా మార్గ మధ్యలో తోటపల్లి బస్టాం డ్‌కు కూత వేటు దూరంలో అదుపుతప్పి రోడ్డు పక్కనే అగి ఉన్న టిఎస్0 8యుఎఫ్0567 నంబరు గల లారీని అతి వేగంగా ఢీ కొట్టడంతో కారులో ఉన్న ఇరువురిలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయని వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## లోక్ సభ ఎన్నికల విధులను సమర్థవంగా నిర్వహించాలి

### -జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
లోక్ సభ ఎన్నికల నిర్వహణలో ఎంఎంసికి కేటాయించిన విధులను సమర్థవంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం లోక్ సభ ఎన్నికల్లో భాగంగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్‌ల గుర్తింపు, పొలిటికల్ ప్రకటనల ప్రీ సర్టిఫికేషన్, మానిటరింగ్ ఇతర మీడియా సంబంధిత విధులను ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా నిబంధనలకు లోబడి నిర్వహించాలన్నారు. సమావేశంలో డిపిఅర్ఓ రవికుమార్, కమిటీ సభ్యులు  పాల్గొన్నారు.


ఎంసిఎంసి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**ఈవీఎం గోదాంను పరిశీలించిన : కలెక్టర్**
లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కలెక్టరేట్ ప్రక్కన గల ఎన్నికల ఈవీఎం గోదాంను సందర్శించారు. లోక్ సభ ఎన్నికలలో ఉపయోగించుటకు ఈవీఎం మిషన్లు సిద్ధం చేయడం ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాటిని పంపిణీ ప్రక్రియ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈవీఎంల రాండమైజేషన్, పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టరేట్ ఏవో రెహమాన్‌ను అదేశించారు. గోదాం చుట్టు 24 గంటలు గట్టి బందోబసుతో విధులు నిర్వహించాలని పోలీసు అధికారులను అదేశించారు.

## ఖాజీపూర్‌లో ముదిరాజ్‌ల గ్రామ బహిష్కరణ

### -కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేసిన బాధితులు

**మిరుదొడ్డి, మార్చి 22, ప్రభాతవార్త :**
సిద్దిపేట జిల్లా భూంపల్లి-అక్బర్‌పేట మండలం ఖాజీపూర్ గ్రామ ముదిరాజ్ కులానికి చెందిన 30 కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేయడంతో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కొద్ది సేపు అందోళన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే సీపీ కార్యాలయంలో సీపీ డా॥అనురాధను కలిసి వినతి పత్రం అందజేశారు.మార్చి 21న గ్రామంలోని అన్ని కులాలు ఏకమై ముదిరాజ్‌లను గ్రామ బహిష్కణ చేస్తున్నట్లు తీర్మాణం చేసినట్లు వివరించారు. దీంతో గ్రామంలో ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని అవేదన వ్యక్తం చేశారు. గ్రామం నుంచి ముదిరాజ్‌లను బహిష్కరించిన గ్రామస్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్య పారిశ్రామిక సొసైటీ ఎన్నికల నిర్వహించడంతో పాటు ఖాజీపూర్ చెరువులో ముదిరాజ్‌లు చేపలు పట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.  ఈ సందర్భంగా రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ 1994లో మత్స్య పారిశ్రామిక సొసైటీ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కొత్త సభ్యులను చేర్చుకోవడం మత్స్య పారిశ్రామిక సొసైటీ ఎన్నికల కోసం మత్స్య పారిశ్రామిక జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా మార్చి 21న ఎన్నికలు నిర్వహిస్తామని నోటీసులు అందజేసినట్లు తెలిపారు. గ్రామస్తులు మత్స్య శాఖ కార్యాలయానికి వెళ్లి ఎన్నికలు నిర్వహించొద్దని బెదిరింపులకు పాల్పడగా ఎన్నికలు వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, ఖాజీపూర్ గ్రామ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ముదిరాజ్‌లు

## బియ్యం దారిదోపిడీ ముఠా అరెస్ట్ : డిఎస్పీ


దారిదోపిడి ముఠా వివరాలు తెలువుతున్న డిఎస్పీ సతనతయ్య

**జోగిపేట, మార్చి 22, ప్రభాతవార్త:** అక్రమ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని వెంబడించి దారిదోపిడీ చేసిన ముఠాకు సంబంధించిన వారిని అరెస్టుచేసినట్లు సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య తెలిపారు. శుక్రవారంనాడు జోగిపేటలోని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 16న ఉదయం నాలుగు గంటల సమయంలో చందానగర్ నుంచి నారాయణఖేడ్‌కు అక్రమబియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని తాడ్‌దాన్‌పల్లి చౌరస్తా నుంచి వెంబడించి సంగుపేట శివారులో ఆ బొలెరో వాహనాన్ని అడ్డగించి వారిని బెదిరించారు. వారిని దింపేసి బొలెరో వాహానాన్ని హత్నూరకు తీసుకెళ్లి అక్కడ తమకు చెందిన వ్యక్తి లారీలో ఆ బియ్యాన్ని లోడ్ చేశారు. అనంతరం ఆ బొలెరో వాహనాన్ని అక్కడే వదిలేశారు. ఈ సంఘటనకు సంబంధించి అందిన ఫిర్యాదుమేరకు పోలీసులు విచారణ జరిపి అందులో నిందితులైన జహీరాబాదుకు చెందిన మహ్మద్ సోహైల్, మహ్మద్ షఫీఖాన్, మహ్మద్ ఇలియాస్, మహ్మద్ అఫ్రోజ్‌లను అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు నిందితులు సోయల్, హైమద్‌లు పరారీలో ఉన్నాట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జోగిపేట సిఐ అనిల్‌కుమార్, ఎస్ఐ అరున్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## పచ్చదనంతో ఆరోగ్యం

### నాటిన మొక్కలను సంరక్షిద్దాం

### కంటికి రెప్పలా కాపాడుతున్న కారోబార్

**నందిగామ, మార్చి 22 ప్రభాతవార్త** మండుతున్న ఎండలకు మొక్కలు వాడిపోతున్నాయి. భగర్భ జలాలు మాయమైపోతున్నాయి. మానవ జంతు పశుపక్షాదులు సైతం గొంతు తడుపుకుందామన్న గుక్కెడు మంచి నీళ్లు దొరక్క అల్లాడి పోయే పరిస్థితి దాపురించింది. వీటన్నిం టిని గట్టెక్కాలంటే నాటిన మొక్కలన సంరక్షించుకోవాలి.చెట్లు ఉంటేనే పర్యావరణ పరిరక్షణ సమతుల్యం వర్షాలు పుష్కలంగా సకాలో కురవ దానికి ఆస్కారం ఉంటుంది. పచ్చదనంతో ఆరోగ్యవనం.. ఆరోగ్యమే మహాభాగ్యం పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలను సంరక్షించుకునే పనిలో పడ్డారు. ఆయా గ్రామాల కార్యదర్శులు కారోబార్లు రోజువారీ దైనందిన పనిలో భాగంగా నందిగామ మండలం చాకలిదానిగుట్ట తండా గ్రామపంచాయతీ కారోబార్ జటావత్ శ్రీను నాయక్ గ్రామపంచా యతీ కార్యాలయం పనులు చేస్తూనే తీరిక సమయంలో మొక్కలకు కలుపుతీస్తూ పాదులు తీస్తూ ఆకులు పిచ్చిమొక్కలు తొలగించే పనిలో నీరుపోసే పనిలో పడ్డారు. కారోబార్ శ్రీనునాయక్ వాటర్ ట్యాంకర్‌ను నడుపుతూ మొక్కలకు నీళ్లు పోస్తూ కాపడుతున్నారు.

### బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

**కందుకూరు, మార్చి 22, ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్తాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 24 వతేదీ ఆదివారం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు మన్నె జయేందర్ తెలిపారు. నియోజకవర్గం పరిదిలోని జిల్లెలగూడ లోని సామ యాదిరెడ్డి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభ మవుతుందని తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ మాజీ చేర్మెన్ యస్ సురేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో బాగంగా మహేశ్వరం నియోజకవర్గం విస్తృతస్తాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. స్తానిక శాసనసభ్యులు మాజీ మంత్రి వర్యులు పి సబితాఇం ద్రారెడ్డి అధ్యక్షత జరిగే ఈ సమావేశానికి పార్లమెంటు పరిదిలోని శాస నసభ్యులు, శాసనమండలి సభ్యులు, మాజీప్రజా ప్రతినిదులు జిల్లా పార్టీ నాయకులు హాజరవుతారని తెలిపారు. కాకిరాములు, లక్ష్మినర్సిం హ్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, అనంద్, ప్రకాశ్‌రెడ్డి, కార్తీక్, లక్ష్మానాచారి, సామ య్య,వెంకటేష్, దేవేందర్, పారిజాత, దర్శన్‌రెడ్డి, పర్వతాలు, పాల్గొన్నారు.

### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో వ్యక్తి మృతి

#### ఒకరికి తీవ్ర గాయాలు

**కందుకూరు, మార్చి 22, ప్రభాతవార్త:** కందుకూరు మండలంలో జరిగి న వేరువేరు సంఘటనలలో చికిత్స పొందుతు వ్యక్తి మృతిచెందగా మ రోవ్యక్తి అసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ శ్రవన్ కథనం ప్రకారం అయా సంఘటనల వివరాలు ఈవిదంగా ఉన్నాయి. నాగర్‌కర్నూలు జిల్లా తాడూరు మండలం, గుంతకోదూరు గ్రామానికి చెందిన టి శంకర్ మిత్రురాలు దివ్యతో కలిసి మంగళవారం మద్యాహ్నం హైద్రాబాద్‌నుండి స్వగ్రామానికి వెలుతుండగా మండల పరిదిలోని హైద్రాబాద్-శ్రీశైలం ప్రధానరహదారిపై గుర్తుతెలియని వాహనం డీకొట్టగా తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ఈ ప్రమాద విషయాన్ని శంకర్ కుటుంబ సభ్యులు చేరవేసిన దివ్య గాయపడిన శం కర్‌ను చికిత్స నిమిత్తం హైద్రాబాద్ బిఎన్‌రెడ్డి సమీపంలోని బృంగి హస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రమాద సమాచారాన్ని తెలుసు కున్న బాదితుని తండ్రి తూంకుంట రాములు పిర్యాదుమేరకు కేసు నమోదు చేసుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరో సంఘటనలో కందుకూరు మండల కేంద్రంలో బిక్షాటన చేస్తు జీవించే గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 13 వతేదీన కొత్తగూడ గేటు సమీపంలో అపస్మారక స్తితిలో పడిఉండగా గుర్తించిన పెట్రోలింగ్ పోలీసులు అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు అతను మృతి చెంది నట్లు పోస్టుమార్టం అనంతరం మత్రుదేహాన్నికుటుంబికులకు అందజేసినట్లు సిఐ మక్బూల్‌జానీ తెలిపారు.

### రేపు అమరుల త్యాగాలు -స్వతంత్ర్య భారతంపై సెమినార్

షాద్‌నగర్, మార్చి 22, (ప్రభాతవార్త) : షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్థంతి సందర్బంగా శనివారం స్థానిక పెన్షనర్స్ భవనంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అమరుల త్యాగాలు - స్వతం త్ర్య భారతం - వార్తమాన పరిస్థితులపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘాల ఐక్యవేదిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్ హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మహిళలు, ప్రజలు విద్యావంతులు అధిక సంఖ్యలో హాజరై అమరులకు నివాళులర్పించి సెమినర్‌ను విజయవంతం చేయాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

### మత్స్య సొసైటీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మహేందర్

**మొయినాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సొసైటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్‌ను రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మత్స్యకారుల విభాగం చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మత్స్య సహకార సొసైటీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన సాయి కుమార్‌ను కలిసి ఆయన శుభాకాం క్షలు తెలిపి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముదిరాజ్ బిడ్డలకు, ప్రత్యేకంగా అన్ని వర్గాల ప్రజలకు ఆయాకుల వృత్తుల వారికి ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలి పారు. కాంగ్రెస్ హయాంలో మత్స్య కారులు ఆర్థికంగా రాజ కీయంగా ఎదుగుదలకు కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందని అన్నారు.

### చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

**షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి నివా సంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలు గంటి మధుసూదన్‌రెడ్డి ఆయన ను కలిసి చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలు పుకు కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

### బ్యాంకింగ్ సదుపాయాలను అందించడమే లక్ష్యం

శామిర్ మార్చి22,ప్రభాతవార్త : ప్రముఖ బ్యాంకు హెచ్‌డిఎఫ్‌సి రిజర్వు బ్యాంక్ గుర్తించిన బ్యాంకింగ్ సదుపాయాలు లేని గ్రామీణ కేంద్రాలలో (యుఆర్‌సిఎస్)వీఎల్‌ఈ సహకారంతో,60 బిజినెస్ కరస్పాండెంట్ బిసి బ్యాంకింగ్ అవుట్‌లెట్‌లను ప్రారంభించామని ప్రకటించింది.ఈ కొత్త అవుట్‌లెట్‌లు ఇప్పుడు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ యూఆర్‌సి నెట్‌వర్క్ ఉనికిని పెంచినట్లు వెల్లడించింది.

## చేసిన అభివృద్ధి చెప్పి ఓట్లు అడగండి

### -పొన్నం గురించి మాట్లాడే అర్హత బొమ్మకు లేదు

### -కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు చందు

**హుస్నాబాద్,మార్చి22,ప్రభాతవార్త**

కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా బండి సంజయ్ హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏం చేశారో చెప్పి ఈ ప్రాంత ప్రజల ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు బంక చందు డిమాండ్ చేశారు.శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గురువారం రోజున రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,నియోజకవర్గ ఇంచార్జీ బొమ్మ శ్రీరాం చక్రవర్తి మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండించారు.పొన్నం ప్రభాకర్ ఈ ప్రాంత ప్రజల అభిప్రాయం మేరకే కరీంనగర్ నుండి ఇక్కడికి వచ్చి ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రి అయ్యారని గుర్తుచేశారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే హుస్నాబాద్ ఉందని మర్చిపోవద్దన్నారు.బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నా వారి తండ్రి బొమ్మ వెంకన్న అయినా తమకు మంచి అభిమానం ఉందని.శ్రీరాం తండ్రికి కూడా కాంగ్రెస్ పార్టీ వేములవాడ టికెట్టు ఇచ్చి పంపిస్తే ఓడిపోయిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు.ఇక కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తుందని అమలవుతున్న పథకాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.బండి సంజయ్ పార్లమెంట్ సభ్యులుగా ఉండి ఐదేళ్లలో హుస్నాబాద్‌కు కాదు కదా కనీసం కరీంనగర్‌కు కూడా ఏం చేయలేరన్నారు.అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు.మాట్లాడే మందు కాస్త ముందు వెనక చూసుకుని మాట్లాడాలని హితవు పలికారు.పొన్నం ప్రభాకర్ గురించి మాట్లాడే అర్హత బొమ్మకు లేదన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వల్లపు రాజు,అక్కన్నపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య,సీనియర్ నాయకులు బురుగు కిష్టస్వామి,వెన్న రాజు,బొమ్మగాని హరిబాబు,మైదంశెట్టి వీరన్న,పెరుమండ్ల నర్సా గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆకతాయిలు మీ ప్రవర్తన మార్చుకోవాలి

### -మారకుంటే కఠిన చర్యలు తప్పవు

### -బాలికలు, మహిళల రక్షణకు షీ టీమ్స్

### -జిల్లా ఎస్పీ బాలస్వామి



ఆకతాయిలకు కౌన్సిలింగ్ ఇస్తున్న దృశ్యం

**మెదక్ మార్చి22,ప్రభాతవార్త :**

ఆకతాయిలు మీ ప్రవర్తన మార్చుకోవాలని, మారకుంటే కఠిన చర్యలు తప్పవని, బాలికలు, మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ ఉన్నాయని జిల్లా ఎస్పీ బాలస్వామి అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశానుసారం అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ ఆధ్వర్యంలో పట్టుబడ్డ ఆకతాయిలకు ఆన్‌లైన్ ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, మహిళలు, చిన్నారులపై జరుగు నేరాలు, వాటి పర్యవసానాల వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. యువత ఆకతాయి పనులు చేసి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, చదువు మీద దృష్టి సారించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనవసరమైన ఆలోచనలతో నేరాలలో చిక్కుకొని సమస్యలు కొని తెచ్చుకోవద్దన్నారు. అలాగే ఆకతాయిల వలన మహిళలకు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 8712657963 నెంబర్‌కు ఫోన్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా మెసేజ్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదును అందుకున్న వెంటనే షీ టీమ్ పోలీసులు బాధిత మహిళలకు అండగా నిలుసానతరని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## వంటేరు ఏ పార్టీలోకి వచ్చినా ఆ పార్టీ భూస్థాపితం

### -వంటేరు కాంగ్రెస్ పార్టీలోకి రావద్దు

### -వంటేరుపై సంచలన వ్యాఖ్యలు చేసిన నర్సారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తూంకుంట నర్సా రెడ్డి

**గజ్వేల్, మార్చి 22 (ప్రభాతవార్త):**

వంటేరు ప్రతాప్‌రెడ్డి ఏ పార్టీలోకి వచ్చినా ఆ పార్టీ భూస్థాపితమవుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి వంటేరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం రిమ్మనగూడ గ్రామ శివారులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వంటేరు ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పుకార్లు వస్తున్నాయని, అవన్నీ అవాస్తవమన్నారు. వంటేరు ప్రతాప్‌రెడ్డికి దండం పెట్టి చెప్తున్నా కాంగ్రెస్ పార్టీలోకి రావద్దని, బిఆర్ఎస్ పార్టీ ఆయన సేవలను వినియోగించుకుందని, అలాగే బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగాలని హితవు పలికారు. వంటేరు ప్రతాప్‌రెడ్డి జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన వారని, దౌలాపూర్ నుండి జగదేవ్‌పూర్‌కు పాలు తీసుకువచ్చి అమ్ముకునే వారని, ఈ రోజు వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆస్తులు ఎన్నో విచారణ చేపట్టాలన్నారు. 2009 నుండి నేటి వరకు సుమారు వందల కోట్ల ఆస్తులు సంపాదించారని, మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలైనా ఆస్తులు మూడింతలు పెరిగాయని, అదే నేను ఎమ్మెల్యేగా గెలిచి ఆస్తులు సంపాదించలేదన్నారు. 2018లో కాంగ్రెస్ పార్టీ ప్రతాప్‌రెడ్డికి టికెట్ ఇస్తే టిఆర్ఎస్ నుండి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఉన్నా సైతం ఆయన కొరకు రాజీనామా చేసి ఎమ్మెల్యే గెలుపు కోసం ప్రయత్నాలు చేశామన్నారు. వంటేరు ప్రతాప్‌రెడ్డి పది సంవత్సరాలు అధికారంలో ఉండి అనేక భూకబ్జాలకు పాల్పడ్డాడని, మేడ్చల్ జిల్లా గౌడెల్లిలో వంద కోట్ల భూమి అండర్ వాల్యూవేషన్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అంతేకాకుండా ప్రజ్ఞాపూర్‌లో సైతం గతంలో ఫ్లాట్లు అమ్మి మరోసారి వారి వద్ద నుండి తీసుకున్నారని, అలాంటి వ్యక్తిని కాంగ్రెస్ పార్టీలోకి రానిచ్చేదిలేదన్నారు.

**వెంకట్రాంరెడ్డికి బిఆర్ఎస్ ఎంపి టికెట్టా**

కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ముంపు గ్రామాల బాధితులను హరిగోసలు పెట్టిన అప్పటి జిల్లా కలెక్టర్ వెంకట్రాంరెడ్డికి ఎంపి టికెట్టా అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుమారు 14 గ్రామాల రైతుల ఉసురు తగులుతుందని, అతను చేసిన అవినీతి అంతా ఇంతా కాదన్నారు. ముందు గ్రామాల్లో ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారో చూస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తున్నామని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొల్లపల్లి నరేందర్‌రెడ్డి, వర్గల్ మోహన్, కొండపాక శ్రీనివాస్, మోహన్, బెజుగామ శివారెడ్డి, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, అయిలం, జాలిగామ మాజీ ఎంపిటిసి ఆంజనేయులు యాదవ్, మైనార్టీ సీనియర్ నాయకుడు అజ్గర్, సురేష్, శ్రావణ్‌కుమార్, క్యాసారం బాబా, మల్లారెడ్డి, శ్రీగిరిపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పోషకాహారంపై అవగాహన

**కడ్తాల్, మార్చి 22 ప్రభాతవార్త :** గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. కడ్తాల్ మండల పరిధిలోని వాసుదేవపూర్ గ్రామంలో అంగన్‌వాడి కేంద్రాల్లోని కిశోర బాలికలు, గర్భిణీలు, బాలింతలకు గురువారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరళ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శరీరంలో పోషకాలు లోపిస్తే పిల్లల ఎదుగుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నివారించేందుకు ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలతో పాటు చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని వారు అన్నారు. గర్భిణీలు సుఖ ప్రసవం కోసం శారీరక శ్రమ చేయాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరళ సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు పాత్లావత్ కమల, సంగీత, ఆయ రాజమ్మ, ఆశ కార్యకర్తల, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

### రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కార్యకర్తల సమావేశం

**బోడుప్పల్, మార్చి 22 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్కా జ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బోడుప్పల్ మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన నాయకులు కార్య కర్తల సమావేశంలో పాల్గొనడం జరిగింది. బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపుకై నాయకులకు కార్యకర్తలకు దిశనిర్దేశం చేసారు. ఈ సమావేశంలో మేయర్ బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ లక్ష్మిరవిగౌడ్, పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, కార్పొరే టర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

### లోక్‌సభ ఎన్నికలో భాగంగా అవగాహన సదస్సు

**యాచారం మార్చి22,ప్రభాతవార్త :** రాబోయే సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఇబ్ర హీంపట్నం ఏసీపి రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఆరుట్ల గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువత ఎన్నికల్లో ఇతర మీటింగ్‌లో ఎలాంటి గొడవలకు ప్రమేయం లేకుండా చూడాల్సిందిగా సూచించారు.అదేవిధంగా యువత ఉన్నతమైన చదువులు చదవాలని యువత ఆరోగ్యంగా ఉండి సక్రమమైన మార్గంలో నడవాలని అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో మంచాల సిఐ బాబ్య నాయక్,యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ వెదిరె సికిందర్ రెడ్డి,ఎంఆర్ఆర్ యువసేన మంచాల మండల అధ్యక్షుడు రాఘవ,యూత్ కాంగ్రెస్ మండల సెక్రటరీ కుకుడాల నరేందర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దాసరమోని అశోక్,యూత్ కాంగ్రెస్ నాయకులు జిల మోని శ్రీనివాస్,పంబాల శ్రావణ్,ఆడెపు మధు, కొల్లోజు విశ్వనాథ చారి, పంబాల కిషోర్,వికాస్, వంశీ,శేఖర్, శ్రావణ్, సాతిరి పృధ్వి,యువకులు, పాల్గొన్నారు.

### మల్లన్న బీరప్ప స్వాముల బ్రహ్మోత్సవాలకు భీమ్‌భరత్‌కు ఆహ్వానం

**మొయినాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** మొయినాబాద్ మండలం సురంగల్ గ్రామంలో వచ్చే నెల 12 నుంచి 15 వరకు జరిగే శ్రీ మల్లన్న, బీరప్ప స్వాముల బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్‌ను గొల్లకురుములు ఆహ్వానం పలికారు, భీమ్‌భరత్‌ను శుక్రవారం కలిసి ఉత్సవాలకు విచ్చేయాలని ఆహ్వాన పత్రికను ఉత్సవ కమిటీ ప్రతినిధులు అందజేశారు.

### బొడ్రాయి ఉత్సవాలకు రూ.1లక్ష విరాళం

**షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** షాబాద్ మండలం రుద్రారం గ్రామంలో ఏప్రిల్ 3వ తేది నుండి నిర్వహించే బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్టా పన కార్యక్రమానికి జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డిని ఆహ్వానించారు. శుక్రవా రం నగరంలోని ఆయన నివాసంలో కలిసిన రుద్రారం గ్రామస్థులు ఉత్సవా లకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఉత్సవాలకు తనవంతు సహాయంగా రూ.1లక్ష విరాళం గ్రామస్థులకు అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు బండ సతీష్, బండ నర్సింహులు, విష్ణువర్దన్‌రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.

### పాఠశాల గోడలకు మ్యూరల్ ఆర్ట్ ద్వారా రంగుల బొమ్మలు

**షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** వెల్స్పున్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సీతారాంపూర్ ప్రభుత్వ పాఠశాల గోడలకు మ్యూరల్ ఆర్ట్ ద్వారా శుక్రవారం విద్యార్థులను ఆకర్శించే విధంగా రంగు రంగుల బొమ్మలనే వేశారు. ఉయ్ వాలంటీర్ అనే కార్యక్రమంలో భాగంగా 60మంది వెల్స్పున్ ఫ్లోరింగ్ టెక్స్‌టైల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### వంటగ్యాస్ వినియోగంపై అవగాహన ఉండాలి

**షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త :** వంట గ్యాస్ వినియోగంపై ప్రతి ఒక్క రికి అవగాహన కలిగి ఉండి ప్రమాదాలు జరగకుండా చూడాలని షాబాద్ భారత్ గ్యాస్ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండలంలోని కస్తూర్భగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వంట గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ వంట గ్యాస్ వినియోగంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు అన్నారు. వంటగ్యాస్ ప్రమాదాల నివారణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని మహేశ్వరి ప్రథమ బహుమతి రూ.500,రెండవ బహుమతి 10వ తరగతి చదువుతున్న శ్రజిత రూ.300 గెలుచుకున్నారు. ఈకార్యక్రమంలో షాబాద్ శ్రీనివాస్ భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది శివ, నవనీత తదితరులు ఉన్నారు.

### మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆమనగల్లు, మార్చి22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామం లో జెల్లా బుడ్డయ్య అకాల మరణం చెందారు. శుక్రవారం తాజామాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం మృతుని కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం వ్యక్తిగతంగా సత్యం బాధిత కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన కొమ్ము యాదమ్మవిష్ణయ్య దంపతుల కుమార్తె వివాహ వేడుకల్లో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం పాల్గొని నూతన వధు వరులను ఆశీర్వదించారు. అనంతరం పెళ్ళి కానుకగా తులం బంగారం అందజేశారు. ఇప్పటికే ఈయన గ్రామానికి చెందిన 81 మంది వధువులకు ఆర్థిక సహాయం అందజేశారు.

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గుర్రం కేశవులు

**ఆమనగల్లు, మార్చి22, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎను ముల రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఉదయం ఆయన నివాసం వద్ద ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు గుర్రం కేశవులు మర్యాద పూర్వకం గా కలుసుకున్నారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన జిల్లా కాంగ్రెస్‌పార్టీ నా యకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గుర్రం కేశవులు ముఖ్య మంత్రిని కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సీఎం సూచించినట్లు గుర్రం కేశవులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి గెలుపు ఖాయమని కేశవులు ధీమా వ్యక్తం చేశారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### -పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్



మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్

**పెద్దశంకరంపేట, మార్చి22 ప్రభాతవార్త:**

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్ అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని ఉత్తులూరు గ్రామంలో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సునీత, పోలీస్ కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలి

### -జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మంగ నాగరాజుగౌడ్



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మంగ నాగరాజుగౌడ్

**కొల్చారం, మార్చి22 ప్రభాతవార్త:**

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మంగ నాగరాజుగౌడ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని బీసీ హాస్టల్‌ను జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మంగ నాగరాజుగౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులను మన సొంత పిల్లల్లాగా చూసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు సిబ్బందిని కౌడిపల్లి హాస్టల్‌కు బదిలీపై పంపివేయడం జరిగిందని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మిగిలిని సిబ్బందిని కూడాబదిలీపై వేరే హాస్టల్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ భానుసింగ్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలను పరామర్శించిన జడ్పివైస్ చైర్మన్

**హుస్నాబాద్,మార్చి22,ప్రభాతవార్త**

హుస్నాబాద్ మండలంలోని పందిల్ల,పొట్లపల్లి గ్రామాలలో ఇటీవల మరణించిన గూళ్ళ గట్టయ్యతో పాటు తాటికొండ గురువారెడ్డిల కుటుంబాలను జిల్లా వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి శుక్రవారం భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు గంగం మదన్‌మోహన్‌రెడ్డితో కలసి పరామర్శించారు.ఈ సందర్భంగా వారి మృతులకు గల కారణాలు అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.పరామర్శించిన వారిలో మాజీ మార్కెట్ చైర్మెన్ తిరుపతిరెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి,మాజీ మార్కెట్ డైరెక్టర్ నరసింహారెడ్డి,పందిల్ల తాజా మాజీ సర్పంచ్ తోడేటి రమేష్, చంద్రమౌళి,ఎల్లాగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి



జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న డాక్టర్ హరిత

**వర్గల్, మార్చి 22 (ప్రభాతవార్త):**

వర్గల్ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్‌ను, ఎల్‌టి యొక్క పనితీరును పరిశీలించారు. వైద్య సిబ్బంది ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం టార్గెట్లను పూర్తి చేసుకోవాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం పూర్తి చేసే విధంగా చూసుకోవాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణ చర్యల గురించి ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా వర్గల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా వైద్యాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### వెంకట్రామ్‌రెడ్డి గెలుపు కోసం సైనికుల్లా ముందుకు సాగుతాం



విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

**సిద్దిపేట అర్బన్, మార్చి 22, ప్రభాతవార్త :**

మెదక్ లోక్ సభ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిగా మాజీ కలెక్టర్,ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డిని పార్టీ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ ప్రకటించడం పట్ల అ పార్టీ సీనియర్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో శుక్రవారం అయన బిఆర్ఎస్ నాయకులు మెర్గు మహేష్, రెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా వెంకట్రామ్‌రెడ్డిని ప్రకటించడంతోనే గెలుపు ఖాయ మైందని తెలిపారు. బిఆర్ఎస్ అవిర్భావం నుంచి మెదక్ పార్లమెంటులో పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తూ వస్తున్నారని తెలిపారు. మాజీ సిఎం, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు నాయకత్వంలో మెదక్ ఉమ్మడి జిల్లా ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చేత గానీ హామీలు ఇచ్చి అధికారంలోకి రాగా నే మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్, బిజెపి పార్టీ అభ్యర్థులకు ఓటు అడిగే కనీస నైతిక హక్కు లేదన్నారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా వెం కట్రామ్‌రెడ్డి పేరును ప్రకటించినందుకు మాజీ సిఎం, పార్టీ అధినేత కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్రామ్‌రెడ్డి గెలుపు కోసం సైనికుల్లా పని చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎల్లారెడ్డి, యాదగి రి, రజనీకాంత్‌రెడ్డి, శ్యామ్, శ్రావణ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను సన్మానిస్తున్న చైర్మన్ గిరిధర్‌రెడ్డి

## ఉపముఖ్యమంత్రిని సన్మానించిన చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్‌గా నియమితులైన ఎంపిపి అధ్యక్షులు ఎన్.గిరిధర్‌రెడ్డి శుక్రవారం ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్కను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని ఉపముఖ్యమంత్రి స్వగృహానికి చేరుకుని మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చైర్మన్‌గా నియమించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్చర్ల, వనపర్తి ఎమ్మెల్యేలు అనిరుద్‌రెడ్డి, మేఘారెడ్డి ఉన్నారు.

## మూడోసారి మోది ప్రధాని కావడం ఖాయం

### ఎంపి బిబి పాటిల్



మాట్లాడుతున్న ఎంపి బిబి పాటిల్

**అల్లాదుర్గం, మార్చి 22,ప్రభాతవార్త:** కేంద్రంలో మూడోసారి భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టడం తథ్యమని, ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ చేయడం ఖాయమని ఆ పార్టీ జహీరాబాద్ ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ అన్నారు. శుక్రవారం అల్లాదుర్గంలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని కార్యకర్తలను ఉద్దేశించి బిబి పాటిల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి గడపలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాల రాములు, పార్టీ మండల అధ్యక్షులు గౌరవిల్లా యాదగిరి, ప్రధాన కార్యదర్శి సాయిలు గౌడ్, నాయకులు నందన్‌గౌడ్, భూమయ్య, రమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు రవి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో కేంద్ర పోలీసు బలగాల కవాతు



సిఆర్‌పిఎఫ్ పోలీసులతో కవాతు నిర్వహిస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

**జహీరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం డిఎస్‌పి కె.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర సిఆర్‌పిఎఫ్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న శివాజీ విగ్రహం నుంచి బస్టాండు మీదుగా పోలీసుతాణా వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ ఆర్ రవి, పట్టణ, రూరల్ పోలీసు, కోహీర్, చిరాగ్‌పల్లి ఠాణాల ఎస్ఐలు లక్ష్మారెడ్డి, వరప్రసాద్, కృష్ణ, నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్టును ఆశ్రయించిన వృద్ధ దంపతులు

### న్యాయం చేసిన న్యాయమూర్తి అనిత



తల్లిదండ్రులకు న్యాయం కల్పించిన న్యాయమూర్తి అనిత తదితరులు

**నర్సాపూర్, మార్చి 22, ప్రభాతవార్త:** కౌడిపల్లి మండలం వెంకట్రావ్ పేటకు చెందిన వృద్ధ దంపతులు గండి లచ్చయ్య, తులిశమ్మ స్థిరచరాస్తులను కోల్పోయి కొడుకు మోసపోవడంతో లీగల్ సర్వీస్ కోర్టును ఆశ్రయించారు. లీగల్ సర్వీస్ మండల కమిటీ నర్సాపూర్, న్యాయమూర్తి కె.అనిత వారికి తగిన న్యాయం చేశారు. వివరాల్లోకి వెళితే... గండ లచ్చయ్య, తులిశమ్మలు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ కోర్టులో స్థిర, చర ఆస్తులను కుమారుడు గండి మధుసూదన్‌గౌడ్ మోసపూరితంగా తన పేరు మీద మార్చుకొని రోడ్డు పాలుచేశాడని, సొంత ఇల్లుకు తాళం వేసి బయటకు పంపాడని న్యాయమూర్తి కె.అనితకు మొరపెట్టుకున్నారు.న్యాయమూరి అనిత కేసును పరిశీలించి తక్షణమే వారికి ఇంటి తాళాలను స్వాధీనం చేసుకుని వృద్ధదంపతులకు అప్పగించింది. అనంతరం అనిత మాట్లాడుతూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే సీనియర్ సిటిజన్ చట్టం కింద కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల ద్వారా వచ్చిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎ.శ్రీనివాస్, మధుశ్రీ, స్వరూపరాణి, కోర్టు సూపరింటెండెంట్ కె.పద్మావతి, లీగల్ సర్వీస్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్ దిలీప్‌కుమార్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల సంరక్షణ, నీటి పొదుపుపై అవగాహన

**నర్సాపూర్, మార్చి 22, ప్రభాతవార్త:** వరల్డ్ వాటర్ డే సందర్భంగా నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు రాంచంద్రాపూర్ గ్రామ ప్రజలకు విద్యార్థులకు చెట్లసంరక్షణ, నీటి పొదుపుపై అవవగాహన కల్పించారు. అదేవిధంగా బివిఆర్ఐటి కళాశాలలో విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, సెమినార్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణారావు, అధ్యాపకులు డాక్టర్ విజయగౌరి, రూపాదేవి, అభయ్ పాల్గొన్నారు.



ప్రజలకు చెట్లసంరక్షణ,నీటిపొదుపుపై అవగాహనకల్పిస్తున్న విద్యార్థులు

# ముగిసిన రేణుక ఎల్లమ్మ ఆలయ 7వ వార్షికోత్సవం

### పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

**మునిపల్లి, మార్చి 22, ప్రభాతవార్త:** మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో కొలువున్న శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండంగా వార్షికోత్సవ వేడుకలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనము, గోపూజ, సర్వదేవత ఆవాహిత పూజ, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చ, దదూదీప నైవేద్యం, మంగళనీరాజనం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా శుక్రవారం ఆలయానికి చేరుకోగా ఉత్సవ కమిటీ బాధ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ బాధ్యులు కాదులూరి నరసింహాగౌడ్ కుటుంబ సభ్యులు మంత్రి దామోదర్ రాజనర్సింహాను ఘనంగా సన్మానించారు. భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అధ్యక్షులు రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సతీష్, ఎంపిటిసి సభ్యులు పాండు, రాధాబాయి, మాజీ ఎంపిటిసి సభ్యులు వెంకట్‌రాములు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజు, మనోహార్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, నరేందర్ గౌడ్, సంగన్న, తాటిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా



వాసవీ మాత ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

### శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి

## ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**గజ్వేల్ టౌన్, మార్చి 22 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని ఆర్యవైశ్య భవనం వద్ద శుక్రవారం గజ్వేల్- ప్రజ్ఞాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకాప రమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమా నికి హాజరైన మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపా రు. వాసవి మాత కరుణ కటాక్షాలతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పురోహితుడు చాడ నంద బాలశర్మతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అలయన్స్ సిద్దిపేట జిల్లాకు మూడు అవార్డులు




అవార్డులు అందుకుంటున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మార్చి 22, ప్రభాతవార్త:** అలయన్స్ అంతర్జాతీయ సదస్సు ఈనెల 16,17వ తేదీలలో ఆగ్రాలో నిర్వహించారు. 28 దేశాల నుంచి అలయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లాకు సోమ వనజకు బెస్ట్ గవర్నర్ అవార్డు, బెస్ట్ సెకండ్ వైస్ గవర్నర్‌గా చకిలం బాలచంద్రం, ఐసీసీ మోర అంజయ్యకు అలయన్స్ అంతర్జాతీయ అధ్యక్షులు పంకజ వాస్తవ చేతులమీదుగా ఆగ్రాలో అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నుంచి సోమ వనజ, చకిలం బాలచంద్రం,అంజయ్య, రాజేశ్వర్‌రెడ్డి, శివకుమార్, పెద్ది రామచంద్రం, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### శేషసాయి మందిరంలో

## కోటి తలంబ్రాల దీక్ష

**గజ్వేల్ టౌన్, మార్చి 22 (ప్రభాతవార్త):**

భద్రాచల శ్రీరాముని కళ్యాణానికి ఉపయోగించే గోటి తలంబ్రాల కార్యక్రమం శుక్రవారం శ్రీ రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న నగర్ కాలనీలో గల శేషసా యి మోక్ష మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామ నామాన్ని స్మరిస్తూ గోటి తో వడ్లను ఒలిచి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు యెల్లు రాంరెడ్డి, అర్చకులు గోపినాథ్‌శర్మ, సదానందం, హరి, సు మన్, మల్లారెడ్డి, అడ్వకేట్ గోపాలరావు, పేర్ల శ్రీనివాస్ తది తరులు పాల్గొన్నారు.



కోటి తలంబ్రాల దీక్షలో పాల్గొన్న భక్తులు

## ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**మిరుదొడ్డి, మార్చి 22, ప్రభాతవార్త:** రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకొని పేద ముస్లిం కుటుంబాలకు డాక్టర్ మొహమ్మద్ సాహెబ్‌హుస్సేన్ అధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.మిరుదొడ్డి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేద 70 మంది ముస్లిం కుటుంబాలకు సరుకులతో పాటు బియ్యం, మహిళలకు బట్టలను అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ 30 రోజుల పాటు ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష చేపడుతారని ఉపవాస దీక్ష ముగిసే సమయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తారన్నారు. రంజాన్ పండగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ గౌరవాధ్యక్షులు జాకీర్ హుస్సేన్, హుస్సేన్, మతీన్, షరీఫ్‌తో పాటు మిరుదొడ్డి జామా మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక



పాఠశాల నూతన కమిటీ

**నంగునూర్, మార్చి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో శుక్రవారం అమ్మ అదర్శ పాఠశాల కమిటీని ప్రాథమిక పాఠశాల అధ్యక్ష, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నెల్లుట్ల మమత, కన్వీనర్‌గా పోనమల్ల రాములు, సభ్యులుగా సామంతుల రజిత, బస్వారాజు అనిత, ఏటి స్వప్న, శామంతుల లాస్య, రుత్విక, గుండెల్లి అను, ఎర్ర యాదవ్వ, గుండెల్లి స్వాతి, చామంతుల సంతో,ఏటి శోభ, కొండపర్తి రాధిక, రంగు మమత, తడకపల్లి సురేఖ, కీర్తి, స్వప్న, రేబర్తి అంజలి, ఏటి రజితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఏ భాగ్య, పాఠశాల ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న పుల్లని వేణు

**చేర్యాల, మార్చి 22, ప్రభాతవార్త:** పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి పుల్లని వేణు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురు చేస్తున్నారన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్,ఫీజు రియంబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయా లన్నారు.సమావేశంలో ఆత మ్కూరు హరికృష్ణ, ఎర్రోళ్ళ అఖిల్, నంగి తిరుపతి,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఫ్రీజింగ్ చేసిన బ్యాంక్ అకౌంట్లను వెంటనే ఆక్టివ్ చేయాలి

**చేర్యాల,మార్చి 22, ప్రభాతవార్త :** ఫ్రీజింగ్ చేసిన కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆక్టివ్ చేయాలని చేర్యాల పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఏవైసి అధ్యక్షులు కమలాకర్, పట్టణాధ్యక్షులు మంచాల చిరంజీవులు,ఆగంరెడ్డి, చేర్యాల ము న్సిపల్ కౌన్సిలర్లు చెవిటి లింగం,సందుల సురేష్,నాయకులు తుమ్మలపల్లి సంజీవులు,బందెల మహిపాల్‌రెడ్డి,దాసరి శ్రీకాం త్,కాశెట్టి ఉపేందర్,నీలం సన్నీ,ప్రసాద్,గుస్క కృష్ణ,వినీత్, బాలరాజు,సాయిరాకేష్,కంక చంద్రం, బాబు, రాజు, చంద్రమౌళి, శ్రీశైలం, సురేష్, సత్యనారాయణ, భాను, అనిల్ పాల్గొన్నారు.



గాంధీ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

### -మాధవనంద సరస్వతి మహారాజ్

**అల్లాదుర్గం, మార్చి 22, ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాధవానంద సరస్వతి మహారాజ్ అన్నారు. శుక్రవారం అల్లాదుర్గంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మూడురోజులుగా జరుగుతున్న స్వామి వారి ధ్వజ స్థంభం విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాల్లో చివరి రోజైన శుక్రవారం మాధవానందస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవనామ స్మరణతో చేపట్టే కార్యక్రమాలు సఫలీకృతమవుతాయన్నారు. ప్రజలు భయాన్ని వీడి భగవంతుడిని నిత్యం ఆరాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కోట ప్రవీణ్‌శర్మ, ఆలయ కవిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎంపి

**అల్లాదుర్గం, మార్చి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం జహీరాబాద్ ఎంపి బిబిపాటిల్ దర్శించుకున్నారు. ఆలయంలో ధ్వజస్థంభ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం ఆలయానికి చేరుకున్న బిజెపి ఎంపి అభ్యర్థి బిబి పాటిల్‌ను ఆలయ కమిటీ బాధ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో బిబి పాటిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు బ్రహ్మం, మండల పార్టీ అధ్యక్షులు యాదగిరి, నాయకులు కాళ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## గజేంద్ర భారతి ఆశ్రమంలో ముగిసిన సప్త

### -ఆశ్రమాన్ని దర్శించుకున్న కాంగ్రెస్ ఎంపి సురేష్‌శెట్కార్



సప్త ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**సిర్గాపూర్, మార్చి 22, ప్రభాతవార్త:** మండలంలోని అంతర్గామ గ్రామంలోని శ్రీగజేంద్ర భారతి ఆశ్రమంలో వారం రోజులుగా కొనసాగుతున్న సప్త కార్యక్రమాలు శుక్రవారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో శ్రీహర భక్త పారాయణ్ కరణ్ గజేంద్రభారత్ మహారాజ్ కాలా కీర్తన సేవా కార్యక్రమాలు న్విహించారు. కీర్తనలో భక్తులకు మహారాజ్ ప్రవచనాలు చేశారు. కలియుగంలో హరినామ స్మరణ భగవంతునికి ప్రేమదాయకమన్నారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, టిపిసిసి ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ శెట్కార్ హాజరై మహారాజ్‌ను సన్మానించ ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పిట్లం, బాన్సువాడ, సంగారెడ్డి, కామారెడ్డి, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. సురేష్‌కుమార్ శెట్కార్ వెంట కౌన్సిలర్ వివేక్, మాజీ సర్పంచ్ రవి, మాజీ జడ్పీటిసి సభ్యులు రవీందర్ నాయక్, వెంకటరామిరెడ్డి, సంజీవులు, రామకృష్ణ, అశోక్ పాటిల్, కరణ్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం

### వేరేచోటుకి మార్చాలని ప్రజల వినతి



నర్సాపూర్ చౌరస్తాలో కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

**నర్సాపూర్, మార్చి 22, ప్రభాతవార్త:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో, తూప్రాన్ రోడ్డులోని మాధవి నర్సింగ్‌హోంవద్దగల విద్యుత్ ట్రాన్స్ పార్మర్‌లతో ప్రమాదం పొంచి ఉందని, దీనిని జనాలు లేని చోటుకు మార్చాలని పలువురు కోరుతున్నారు. నర్సాపూర్ చౌరస్తాలోగల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్, తూప్రాన్ రోడ్డులో గల ట్రాన్స్ ఫార్మర్ వద్ద జనసమ్మర్ధం ఎక్కువగా ఉండటంవల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ ట్రాన్స్ పార్మర్‌ల చుట్టూ రక్షణ కంచె లేకపోడవంతో ప్రజలు అక్కడ నిలబడాలంటేనే భయపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చౌరస్తాలోని సిగ్నల్ వద్ద ఉండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ రెండు ప్రాంతాల్లో ప్రజలు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో సంచరిస్తుంటారు దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉక్కువగా ఉన్నాయి.నర్సాపూర్ పట్టణ ంలో ప్రదాన కూడలి అయినందున ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తు నిలబడతారు. అంతేగాక చిరువ్యాపారులు కూడ ఫుట్‌పాత్‌ల పై వ్యాపారాలు కొనసాగిస్తురని దీంతో జనసమ్మర్ధత ఎక్కువగా ఉంటుంది.ఈ మేరకు ఈ రెండు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున వీటిని జన సంచారం లేని ప్రదేశాల్లో ఏర్పాటు చయేయాలని పలువురు కోరుతున్నారు.

## వెంకట్రామ్‌రెడ్డికి ఎంపి సీటు, బిఆర్ఎస్ నేతల హర్షం

**నర్సాపూర్, మార్చి 22, ప్రభాతవార్త:** మెదక్ పార్లమెంట్‌నుంచి బిఆర్ఎస్ పార్టీ తరపున ఎంపి అభ్యర్థిగా పోటీ చేసెందుకు ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డికి టికెట్టు కేటాయించడంపట్ల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వెంకట్రామ్‌రెడ్డి గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు అదనపు కలెక్టర్‌గా, సిద్దిపేట జిల్లాకు కలెక్టర్‌గా పని చేశారని తెలిపారు. ఈ ప్రాంతం పై వెంకట్రామ్‌రెడ్డికి మంచి పట్టుఉందని అన్నారు. అటువంటి వ్యక్తి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంపిగా పోటీ చేసేందుకు టికెట్టు కేటాయించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కాంగ్రెస్, బిజెపిలు ఎన్ని కుట్రలు చేసినా మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బిఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నా దీమాను వారు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, సూరారాం నర్సింలు, కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, జ్ఞానేశ్వర్‌గుప్త, బాల్‌రెడ్డి, రింగుల ప్రసాద్, వెంకటేశ్, నాగరాజుగౌడ్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

### నంగునూరు మండలంలో...

**న ంగునూర్, మార్చి 22, ప్రభాతవార్త :** మెదక్ పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి పేరును ప్రకటించడం పట్ల మండల బిఆర్ఎస్ నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, వెంకటరెడ్డి, లింగంగౌడ్, ఎల్లంకి మహిపాల్‌రెడ్డి, కోల రమేష్‌గౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు. నంగునూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ 17 స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. మెదక్ పార్లమెంటు నుంచి బిఅర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డిని గెలుపించుకోవడానికి పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు సిద్దంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు ఐలయ్య, వెంకటేష్, పర్శరాములు, రమేష్, ఇమ్రాన్, చందు, రాకేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డుగా మారిన మెదరోనికుంట

### పారిశుధ్యం పనులపై అధికారుల నిర్లక్ష్యం.. రోగాలబారిన పడుతున్నామంటూ కాలనీవాసుల ఆవేదన

**టేక్మాల్, మార్చి 23,ప్రభాతవార్త:** ప్రజాప్రతినిధుల పరిపాలన ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండల కేంద్రమైన టేక్మాల్‌లో పారిశుధ్య కార్యక్రమాల నిర్లక్ష్యం చూపుతున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు. టేక్మాల్‌లో రోజు సేకరించిన చెత్తచెదారాలను అంగడిబజార్ ఆనుకొని ఉన్న మెదరొనికుంటలో పోస్తున్నారు. దీంతో ఆ కాలనీ వాసులు అధికారులకు, సిబ్బందికి చెత్తచెదారాలను ఇక్కడ పోయవద్దని పలు మార్లు విన్నవించినా పట్టించుకోకుండా అక్కడే పోస్తున్నారు. ఉట్టి కాగితాలే ఉన్నాయంటూ చెత్తచెదారాలను ట్రాక్టర్లతో పోస్తూ రెండు, మూడు రోజులకో సారి తగులబెడుతున్నారు. చెత్తచెదారాలను కుంటలో పోయడంతో ఆ కాలనీ వాసులకు దుర్గంధం వెదజల్లుతోందని, అనేక రాకల వ్యాధులు వ్యాపిస్తాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టేక్మాల్ ప్రత్యేకాధికారులు పారిశుధ్య పనులపై, సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ స్థానికులు మండి పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మెదరొనికుంటలో చెత్తచెదారాలను పోయకుండా చూడాలని డంపింగ్‌యార్డును వినియోగించుకోవాలని కొరుతున్నారు.



మెదరోనికుంటలో చెత్తచెదారాలను పోస్తున్న దృశ్యం

## అబ్లాపూర్‌లో ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

**పాపన్నపేట, మార్చి 22, ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా చెరువులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని అబ్లాపూర్ గ్రామ శివారు నుంచి గురువారం రాత్రికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ వివరించారు.